క్లుప్తంగా

నన్ను మరవద్దు సార్..



మంత్రితో శుభప్రద్‌పటేల్

తాండూరు: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ సోమవారం రాత్రి మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా.. మంత్రి మాట్లాడుతూ తాండూరులో రాజకీయం బాగానే చేస్తున్నావు పటేల్ అనగా.. ప్లీజ్ సార్ నన్ను మరవద్దు అని కోరినట్లు శుభప్రద్ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

యాలాల: రాస్నం గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి భార్య కీర్తన అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఆయన తండ్రి విఠల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పరిధిలో లేని సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్

కొడంగల్ రూరల్: తమ పరిధిలో లేని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో 8 అర్జీలు వచ్చాయని, సమస్యలు పరిష్కరించడటంతో పాటు బాధితులకు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పింఛన్‌కు సంబంధించిన అర్జీలు వచ్చాయని, వాటినీ పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఎన్విరాల్‌మెంట్ అధికారి భరత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు వచ్చేశాయ్

త్వరలో పంపిణీ: ఎంపీడీఓ



క్రీడా కిట్స్‌ను దిగుమతి చేస్తున్న కూలీలు

పెద్దేముల్: మండల కేంద్రానికి క్రీడా కిట్లు సోమవారం వచ్చాయి. 37 గ్రామ పంచాయతీలకు, అనుబంధ గ్రామాలతో కలిపి మొత్తం 41 క్రీడా పరికరాలు వచ్చినట్లు ఎంపీడీఓ లక్ష్మప్ప తెలిపారు. వాటిని త్వరలో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ఆయా జీపీ కార్యదర్శులకు అందజేస్తామని పేర్కొన్నారు. మంబాపూర్, బాయిమీదితండా, మదనంతపూర్, మన్‌సాన్‌పల్లి, మారేపల్లితండా, పాషాపూర్ గ్రామాల్లో సకాలంలో స్థలాలు కేటాయించలేదని, అటవీ శాఖ స్థలాలు ఉండటంతో ఆలస్యం అయిందని, వెంటనే క్రీడా ప్రాంగణాలను ప్రారంభిస్తామని వెల్లడించారు.

చేసిన సేవలే గుర్తుంటాయి



రత్నంను సన్మానిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఎక్కడ పనిచేసినా చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచి పోతాయని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహించి, బదిలీపై భూపాలపల్లి జిల్లాకు వెళ్లిన రత్నంను సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఉద్యోగ నిర్వహణలో బదిలీలు సాధారణమన్నారు. ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ వీరేశం, ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు బీమా

తాండూరు: పారిశుద్ధ్య కార్మికులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన ఎజెండాలోని 14 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పౌరసేవ కేంద్రం ఏర్పాటుకు రూ.15 లక్షలు, కార్మికులకు జీవిత బీమాతో పాటు మున్సిపల్ వాహనాలకు బీమా, నర్సరీల ఏర్పాటుకు గ్రీన్ బడ్జెట్ నిధులకు వినియోగం కోసం రూ.30 లక్షలకు ఆమోదం లభించింది. మున్సిపల్ కమిషనర్ షఫివుల్లా, వైస్ చైర్‌పర్సన్ దీప, కౌన్సిలర్లు నీరజ, రత్నమాల, రజాక్, లతాగౌడ్, అస్లాం, భీంసింగ్ రాథోడ్, రామకృష్ణ, వెంకన్నగౌడ్ ఉన్నారు.

ఆరు గంటలు నిల్చుంటే..



రైతు సేవా సహకార సంఘం ఎదుట ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

రెండు సంచుల యూరియా
- ఎరువుల కోసం రైతుల పడిగాపులు
- సకాలంలో అందడం లేదని ఆవేదన

పెద్దేముల్: సాగు పనులు ముమ్మరమైనా.. ఎరువులు అందక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. 'గతంలో విత్తనాలు వేయకముందే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేవి. కానీ మూడేళ్లుగా మండలంలో ఎరువులు సకాలంలో అందడం లేదు. వాటి కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆరు గంటలు నిలబడితే రెండు సంచులే ఇచ్చారు' అని రైతులు ఆరోపిస్తున్నారు.

ఆర్థిక భారం..

30 రెవెన్యూ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌కు 24,751 ఎకరాల సాగు భూమి ఉంది. అందుకు సుమారు డీఏపీ–780 మెట్రిక్ టన్నులు, యూరియా–1815, పొటాష్–400లు, కాంప్లెక్స్–500 మెట్రిక్ టన్నుల అవసరం ఉందని ఏఓ నజీరొద్దీన్ తెలిపారు. కానీ పూర్తి స్థాయిలో అవి అందక, ఇతర ప్రాంతాల నుంచి అధిక ధరకు విక్రయించడం, అక్కడి నుంచి గ్రామాలకు తీసుకు వచ్చేందుకు సమయ పాలనతో పాటు, ఆర్థికం భారం పడుతుందని పెద్దేముల్, మారేపల్లి తదితర గ్రామాల రైతులు అంటున్నారు.

అరకొర బస్తాలు..

పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘానికి సోమవారం యూరియా లారీ రావడంతో రైతులు ఉదయం 7గంటల నుంచి బారులు తీరారు. కనీసం ఎకరాకు రెండు బస్తాలు కూడా ఇవ్వడం లేదని, పట్టా పాసుబుక్‌పై రెండు బస్తాలు ఇస్తే ఎలా సాగు చేయాలని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎరువుల కొరత లేదంటూనే.. ఇలా అరకొర బస్తాలు ఇవ్వటం ఎంత వరకు సమంజసమంటున్నారు. వరుస వర్షాలకు పంటలను రక్షించుకోవాలంటే ఎరువులు వేయాల్సి ఉందని, విత్తనాలు వేసే సమయంలో ఎరువు అంద జేయకపోయినా.. కనీసం పంటలు ఎదిగే సమయంలోనైనా సరఫరా చేయకపోతే ఎలా అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎరువు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏ మూలకు సరిపోదు



ఎరువుల కోసం మూడు రోజుల నుంచి ఎదురు చూస్తే.. రైతు సేవా సంఘం అధికారులు రెండు సంచులే ఇచ్చారు. అది ఏ మూలకు సరిపోదు. మళ్లీ అధిక ధరలకు విక్రయించక తప్పేట్లు లేదు. ప్రభుత్వం ఎరువుల కొరత తీరుస్తానంది. కానీ సమస్య అలాగే ఉంది. మా గోస ఎవరు పట్టించుకోట్లేదు.

– బాలప్ప, రైతు పెద్దేముల్

సమస్య రాకుండా చూస్తాం



ఇప్పటి వరకు రెండు లారీల యూరియా మాత్రమే వచ్చింది. మరో రెండు లారీల్లో పంపాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం. వచ్చిన వెంటనే అందజేస్తాం. ఒక్క లారీ యూరియాకు పెద్ద సంఖ్యలో రైతులు రావడంతో.. రెండేసి సంచులే ఇచ్చాం. మొదటి రోజు పట్టా పాసుబుక్‌కు నాలుగు సంచులు అందజేశాం.

– మురళీగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ మేనేజర్, పెద్దేముల్

మనషులంతా సమానమే..

- కులం వద్దు.. మతం వద్దు
- మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలి
- పౌరహక్కుల దినోత్సవంలో పోలీసులు, అధికారులు

తాండూరు రూరల్: మనషులంతా సమానమేనని, వివక్ష చూపొద్దని కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు మండలం చిట్టిఘనాపూర్‌లో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు చేపడతామని, హక్కుల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా హక్కులను ఎలా వినియోగించుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, నాయకులు వెంకట్రాములుగౌడ్‌లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ పౌరహక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ అన్నారు. కుల్కచర్ల మండలం ఘనపూర్‌లో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, పోలీసు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. స్థానిక నాయకులు ఘణపురం వెంకటయ్య పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

పెద్దేముల్: కుల వివేక్షతకు తావులేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని ఎస్ఐ కాశీనాథ్ అన్నారు. పెద్దేముల్ మండలం జనగాం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రుక్మిణమ్మ అధ్యక్షతన నిర్వహించిన పౌర హక్కుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగిఉండాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సదుపాయాలు, ప్రభుత్వ హాస్టల్ గురించి వివరించారు. చిన్నారులను పనిలో పెట్టుకోవడం, వారితో వెట్టి చాకిరి చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ రాజిరెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్, జీపీ కార్యదర్శి మల్లికార్జున్, గ్రామ పెద్దలు ముకుందు రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో..

బొంరాస్‌పేట: ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవించేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించవద్దని తహసీల్దారు భీమయ్యగౌడ్, ఎస్ఐ శంకర్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా వారు మాట్లాడారు. కుల,మత భేదం లేకుండా సోదరభావంతో మెలగాలని సూచించారు. సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్: మాట్లాడుతున్న ఎస్ఐ కాశీనాథ్



తాండూరు రూరల్‌లో.. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

ఓటింగ్ యంత్రాలపై అవగాహన

పెద్దేముల్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం)లపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం జనగాం, మారేపల్లిలో ఈవీఎంల ప్రదర్శనతో పాటు మాక్ పోలింగ్ నిర్వహించారు. 18 ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగిన వారికి ఈవీఎంలపై, ఓటు వేసే విధానం, మాక్ పోలింగ్ నిర్వహణ గురించి వివరించారు. అనంతరం ఆయన మట్లాడారు. అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఓటు ప్రాధాన్యతను వివరించారు. కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్, ఈవీఎంల పనితీరు, ఓటు వేసే విధానంపై పౌరులకు వివరించారు. ఓటరుకు తాను ఓటు వేసే గుర్తు డిస్‌ప్లే పై కనబడుతుందని, తద్వారా తమ ఓటు అనుకున్న వారికే వేశామా లేదా అనే విషయాన్ని నివృత్తి చేసుకునే విధానాన్ని ప్రదర్శించారు. ఇందులో కార్యాలయ సిబ్బంది గోపాల్ పాల్గొన్నారు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుల్కచర్లలో..

కుల్కచర్ల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అల్లాపూర్ సర్పంచ్ సివిబాయి, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు అన్నారు. కుల్కచర్ల మండలం అల్లాపూర్ జీపీ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం, ఈవీఎం వినియోగం, వీవీప్యాట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి మైమూనబేగం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం జాగ్రత్త

- మూగజీవాలకు వ్యాధినిరోధక టీకా తప్పనిసరి
- పశు వైద్యులు, ప్రజాప్రతినిధులు



యాలాల: పగిడియాలలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

యాలాల: పశువులకు గాలికుంటు టీకాను తప్పనిసరిగా వేయించి, మూగజీవాలు జబ్బుల బారిన పడకుండా కాపాడుకోవాలని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా రైతులకు సూచించారు. సోమవారం యాలాల మండలం పగిడియాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీకా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పశువైద్యాధికారి శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో 12,400 పశువులకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్యులు మూడు జట్లుగా విడిపోయి.. ప్రతి రోజు మూడు గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బసిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు, ఏఎంసీ డైరెక్టర్ ఆశన్న, నాయకులు మల్లారెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టల్లో పుండ్లు ఏర్పడి..

కొడంగల్ రూరల్: వర్షాకాలంలో పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ ఇప్పించాలని రైతులకు పశువైద్యాధికారులు డాక్టర్ రియాజ్ అహ్మద్, డాక్టర్ పరమేష్ సూచించారు. కొడంగల్ మండలం రుద్రారం, ఆలేడ్, గుండ్లకుంట గ్రామాల్లో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వాతావరణంలో మార్పు కారణంగా మూగజీవాలకు గాలి కుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉందని, గిట్టల్లో పుండ్లు ఏర్పడి నడవలేని స్థితికి చేరుకుంటాయని తెలిపారు. ముందుస్తుగా వ్యాధి నిరోధక టీకా ఇప్పించినట్లయితే.. జబ్బుల బారిన పడకుండా వాటిని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది వెంకటయ్య, సూర్యనారాయణ, గోపాలమిత్ర రఘురామ్, రైతులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: ఆలేడ్‌లో పశువులకు మందు వేస్తున్న వైద్య సిబ్బంది

నాలుగేళ్లుగా జీతాల్లేవు

- పనిచేయిస్తున్నారు.. ఫైనలిస్తలేరు
- పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

తాండూరు: 42 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న 18 మంది పారిశుద్ధ్య కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. నాలుగేళ్లుగా పారిశుద్ధ్య పనిచేస్తున్నా.. నాటి నుంచి వేతనం ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వేతనాలు చెల్లించాలని గతంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం అయిందని, అయినా అధికారులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. గత కమిషనర్లను అడిగితే చెల్లిస్తామంటూ హామీ ఇచ్చారు. కానీ బదిలీపై వెళ్లిపోయారని విమర్శించారు. కొత్తగా వచ్చిన కమిషనర్ అయినా స్పందించి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కౌన్సిలర్ సమావేశానికి వచ్చిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, కౌన్సిలర్లకు కార్మికులు తమ గోడు వినిపించారు.

టీచర్ల బదిలీలు చేపట్టాలి

- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి
- తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు

తాండూరు టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనందం మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రమోషన్లు, బదిలీలు లేక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ ప్రక్రియ చేపట్టాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో వాచ్‌మెన్లు, స్కావెంజర్లను నియమించాలని, పీఆర్సీ కమిటీని నియమించి, ఉద్యోగులు నష్టపోకుండా ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. పండిట్, పీఈటీ అప్ గ్రెడేషన్, మోడల్, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మీడియా కన్వీనర్ బస్వరాజు, శ్రీశైలం, శ్రీనివాస్, రాజేష్, భరత్, సిద్రామేశ్వర్ ఉన్నారు.

జోరందుకున్న వరినాట్లు

- కురుస్తున్న వర్షాలతో వేగం పెంచిన రైతులు
- సాగు ఆలస్యమైతే పీడించనున్న చీడపీడలు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు
- వ్యవసాయ అధికారి ప్రసన్నలక్ష్మి





గంగ్యాడలో వరినాట్లు వేస్తున్న మహిళలు(ఫైల్)

నవాబుపేట: వానాకాలం సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండటంతో నీటి వనరులు ఉన్న రైతులు వరినాట్లు వేయడంలో బిజీగా ఉన్నారు. నాట్ల సమయంలో రైతులు ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులు, వాడాల్సిన క్రిమిసంహారక మందులు, కలుపు, తెగుళ్ల నివారణ తదితర వాటిపై మండల వ్యవసాయ అధికారిణి ప్రసన్నలక్ష్మి పలు సూచనలు, సలహాలు చేశారు. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.

ముదురు నారు కావాలి

ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, బీపీటీ, సువర్ణ, చైతన్య, కృష్ణవేణి, వంటి దీర్ఘకాలిక రకాల్లో నారు వయసు 60 రోజులు ఉంటే నాటవచ్చు. ఎంటీయూ1001, ఎంటీయూ 1075 వంటి మధ్యకాలిక రకాలకు 50 రోజుల వయసు ఉండే నారునాటాలి.

నీటి లభ్యత లేకపోతే

నీటి లభ్యత లేక నాట్లు ఆలస్యమయ్యేటప్పుడు నారుమడికి ఎరువులు వేయొద్దు. అవకాశాన్ని బట్టి.. బెట్టను తట్టుకోవడానికి ఒక శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణం పిచికారీ చేయాలి.

నారు దగ్గరగా నాటాలి

ముదురు నారు నాటితే పిలకలు తక్కువవుతాయి. నాట్లు దగ్గర దగ్గరగా వేసుకోవాలి. చదరపు మీటరుకు 33 మూసలకు బదులుగా 44 కుదుళ్లు నాటాలి. ఒక్కో కుదురుకు 2–3 మొక్కలకు బదులుగా 4–5 మొక్కలు ఉండేటట్లు చూసుకోవాలి.

తెగుళ్ల నివారణ

పురుగులు, తెగుళ్ల ఉనికిని గమనించుకుంటూ నారుమడిలో అవసరం మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నారుమడిలో విత్తిన 3–5 రోజుల్లో ఎకరం నారుమడికి 35 గ్రాముల అక్సాడయార్జిల్‌ను లేదా 80 గ్రాముల పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్‌లో ఏదో ఒక దానిని అర లీటర్ నీటిలో కలపాలి. ఆ ద్రావణాన్ని 20కిలోల పొడి ఇసుకతో మిశ్రమం చేయాలి. పలుచటి నీటి మీద పొలంలో చల్లుకోవాలి.

కలుపు నివారణ ఇలా

విత్తిన 15–20 రోజుల సమయంలో గడ్డిజాతి కలుపు ఉంటే ఎకరాకు సైహాల్ పాస్ పి బ్యూటైల్ ద్రావణం 400మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఊదగడ్డి వంటి గడ్డి జాతి మొక్కలు, వెడల్పాటి ఆకుల మొక్కలుంటే ఎకరానికి 80 మిల్లీ లీటర్ల బిస్ పైరిబాక్ సోడియంను పిచికారీ చేసుకొని కలుపు నివారించుకోవచ్చు.

నారు తీయడానికి ముందు

నారు తీయడానికి వారం ముందు పలుచటి నీటి మీద సెంటు నారుమడికి గులికల పొడిని ఇసుకలో కలిపి చల్లుకోవాలి. భాస్వరం, పొటాష్, ఎరువులకు సిఫారసు చేసిన మేరకే దమ్ములోనే వేయాలి. 150 కిలోల సింగ సూపర్, 30–40 ధలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చేసుకోవచ్చు. నత్రజనిలో సగభాగం 40 కిలోల యూరియాను దమ్ములో వేసుకోవాలి. మిగిలిన సగ భాగంలో రెండు దఫాలుగా పైపాటుగా నాటిన 20 రోజులకు వాడవచ్చు. మిగిలిన భాగాన్ని అంకురం దశలో వేయాలి.

ఆలస్యం అయితే చీడపీడల బెడద

నాట్లు ఆలస్యం అయ్యే కొద్దీ హిస్పీ, ఉల్లికోడు వంటి పురుగుల ఆశించే అవకాశం ఉంది. పైరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవి నష్ట పరిమితి స్థాయిని దాటినప్పుడు సిఫారసు చేసిన క్రిమిసంహారక మందులను పిచికారీ చేసుకోవాలి. పొడతెగులు, కాండం కుళ్లు తెగుళ్లు వంటివి గమనించుకుంటూ సిఫారసు చేసిన తెగుళ్ల మందులను సకాలంలో పిచికారీ చేయాలి. నాట్లు ఆలస్యమై, నారు అందుబాటులో లేనప్పుడు వరిని దమ్ముచేసిన చేలల్లో నేరుగా వెదజల్లి సాగు చేసుకోవాలి.

అదునులోనే కలుపు తీయాలి

కలుపు నివారణ సకాలంలో చేపట్టాలి. నాటిన 3–5 రోజులకు ప్రిటిలాక్లోర్400 మిల్లీ లీటర్ లేదా అక్సాడయార్జిల్ 36 గ్రాములు ఎకరానికి 20 కిలోల పొడి ఇసుకతో కలిపి చల్లుకోవాలి. నాటిన 15–20 రోజుల్లోపు గడ్డిజాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరానికి 400 మి.లీ. సైహలోపాప్ బ్యూటైల్‌ను, గడ్డిజాతితో పాటు వెడల్పాటి మొక్కలుంటే 80 మి.లీ. బిస్ పైరిబాక్ సోడియంను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. నాటిన 25–30 రోజులకు వెడల్పాకు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉంటే 2,4–డీ సోడియం సాల్టును ఎకరాకు 400 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలుపి పిచికారీ చేసుకోవాలి.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

బంట్వారం: కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రానుందని ఆ పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ ధీమా వ్యక్తంచేశారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. కేసీఆర్ మాయ మాటలను ప్రజలు మరోసారి నమ్మే స్థితిలో లేరని, వికారాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అన్సారీ, మాజీ జెడ్పీటీసీ అంజయ్య, కోట్‌పల్లి మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వర్, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు రాచిరెడ్డి, రామునాయక్, ఏసయ్య, అక్బర్, ప్రభాకర్‌రెడ్డి, మాధవ్, నర్సింహులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

◆ అత్యవసర వైద్య సేవలకు 'ఆరోగ్య రథం'

మర్పల్లి: పేద ప్రజల ఆరోగ్యం కోసం ఎంపీ రంజిత్ రెడ్డి ప్రతి మండలంలో తన సొంత నిధులతో ఆరోగ్య రథం నడపడం అభినందనీయమని జెడ్పీటీసీ పట్నే మధుకర్ అన్నారు. సోమవారం సిరిపురంలో సర్పంచ్ మల్లయ్యతో కలిసి జెడ్పీటీసీ ఆరోగ్య రథం ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర వైద్య సేవల కోసం ఆరోగ్య రథాన్ని వినియోగించుకోవాలని కోరారు.

◆ 'విశ్వరూప' విజయవంతానికి కమిటీ

ధారూరు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆగస్టు 3న వికారాబాద్‌కు రానున్నారని సమితి జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు పుష్పరాణి, ధారూరు, వికారాబాద్ ఇన్‌చార్జిలు నర్సింహులు, మల్లేశం పేర్కొన్నారు. సభను విజయవంతం చేసేందుకు ప్రత్యేక కమిటీని నియమించినట్లు తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఇనేష్, ఉపాధ్యక్షుడిగా బుజ్జిబాబు, సాయిలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ తదితరులను నియమించినట్లు వెల్లడించారు.

◆ మూణ్నాళ్ల ముచ్చటే?

కుల్కచర్ల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.10 లక్షలతో చౌడాపూర్ గ్రామపంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో నాలుగు నెలల క్రితం నిర్మించిన సీసీరోడ్డు.. 4 నెలలు పూర్తి కాకముందే పగుళ్లు ఏర్పడ్డాయి. నాసిరకంగా రోడ్డు వేయడంతోనే ప్రజాధనం దుర్వినియోగం అయిందని స్థానికులు ఆరోపించారు.

◆ నేడు 'కదన భేరి'

అనంతగిరి: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మంగళవారం నిర్వహించే 'కదన భేరి' సభను విజయవంతం చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నవీన్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ భేరికి వేలాదిగా విద్యార్థులను తరలిస్తున్నట్లు వెల్లడించారు.

◆ దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం



మయూర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యుడు

కొడంగల్ రూరల్: ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, దళితరత్న అవార్డు గ్రహీత మయూర్‌ను ఆర్అండ్‌బి అతిథి గృహంలో సోమవారం మానిటరింగ్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు దస్తప్ప మాట్లాడారు. నిత్యం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన రచించిన రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తూ మయూర్ కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటి వరకు జిల్లాలో 617రోజుల పాటు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారని, ఈ సందర్భంగా మయూర్‌ను సన్మానించినట్లు ఆయన తెలిపారు. సాయిలు, అశోక్, కుశలప్ప, రమేష్, అబ్బులప్ప, రాజశేఖర్ పాల్గొన్నారు.

◆ రేపు సర్వసభ్య సమావేశం

కొడంగల్ రూరల్: ఆగస్టు 2న ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పాండు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షతన జరగనున్న సమీక్షకు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు రావాలన్నారు.

◆ అభినందనీయం

పరిగి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. సోమవారం పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి పాఠశాలలో గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి శ్రీశైలం.. విద్యార్థులకు షూ, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.